

వైద్యవిద్య చదవాలనుకునే విద్యార్థులు జాతీయస్థాయిలో రాసే పరీక్ష... 'నీట్'. సరైన ప్రణాళిక వేసుకుని ఆ ప్రకారం తయారవ్వడానికి అనువైన సమయమిదే. ఈ పరీక్ష స్కోరులో, మొత్తం ర్యాంకులో కీలకపాత్ర వహించేవి జీవ శాస్త్రం (బయాలజీ) మార్కులు. నీట్ పూర్వ ప్రశ్నపత్రాల తీరు ద్వారా ఈ సబ్జెక్టును ఎలా సాధన చేయాలో గ్రహించవచ్చు. అందుకు ఉపకరించే విశ్లేషణ..!

స్కోరుకు జీవం!

నీట్‌లో మంచి ర్యాంకుతోపాటు ప్రభుత్వ/ప్రైవేటు 'ఎ' కేటగిరీలో సీటు సాధించాలంటే 720 మార్కులకు 510కుపైగా, ప్రైవేటు 'బి' కేటగిరీలో సీటు సాధించాలంటే 330కిపైగా మార్కులు సాధించాలి. కేవలం క్వాలిఫై అవ్వాలన్నా, ఇతర కేటగిరీల్లోనైనా స్కోరు ఆశించిన స్థాయిలో ఉండాలన్నా బయాలజీదే సింహభాగం అవుతుంది. అంటే.. ఈ సబ్జెక్టులో పట్టు లేకపోతే 'నీట్'లో ఏ స్థాయిలో రాణించాలన్నా కష్టమే.అందుకే బయాలజీపై ఎక్కువ శ్రద్ధ పెట్టాల్సిన అవసరముంది. ఇదివరకు సరిగా చదవకపోయినా, చదివినవి మర్చిపోయినా ఇప్పుడు దాన్ని సరిచేసుకునే అవకాశం ఉంది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వైద్య కళాశాలల్లో ప్రవేశానికి ఇంటర్ మార్కులతో సంబంధం లేదు. అందువల్ల జనవరి, ఫిబ్రవరిల్లో కొంత సమయం దాకా కూడా నీట్ ప్రవేశానికి అధ్యయనం చేసుకోవచ్చు. ఇంటర్‌లో రెండో సంవత్సరంలో ఉండే అంశాలపై ఫిబ్రవరిలో ఎక్కువ శ్రద్ధపెడితే రెండింటికీ ఉపయోగం. 720 మార్కుల్లో బయాలజీకి 360 ఉన్నాయి కాబట్టి ప్రత్యేక శ్రద్ధ, ప్రణాళిక అవసరం.

దత్తాత్రేయ ఎక్కిరాల

మెరుగైన మార్కులకు...

◆ ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అంశాలు క్షుణ్ణంగా, సూక్ష్మంగా చదవాలి. కొన్ని ప్రశ్నల్లో ప్రత్యేకించి పుస్తకాల్లో ఇచ్చిన పదాల, అంశాల ఆధారంగా మాత్రమే చేయగలిగినవి ఉంటాయి.

◆ పుస్తకాల్లో ఇచ్చిన పటాలను జాగ్రత్తగా గమనించాలి. ప్రాక్టికల్స్‌లో లేకపోయినా పటంలో ఉంటే వాటి గురించి తెలుసుకోవాలి. 2017 పరీక్షలో పటం ఆధారంగా ఎక్కువ ప్రశ్నలు లేవు. అలాగని అశ్రద్ధ చేయడం తగదు.

◆ నీట్ ప్రణాళికలో లేకపోయినా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తక అంశాలను తప్పకుండా అధ్యయనం చేయాలి. ముఖ్యంగా కప్ప, వానపాము అంశాలకు సంబంధించినవి గుర్తుంచుకోవాలి. 2017లో కప్ప నుంచి 2 ప్రశ్నలు వచ్చాయి.

◆ ప్రాక్టికల్ పుస్తకం వెనుక ఇచ్చిన అంశాలను (సప్లిమెంట్) మర్చిపోకుండా అధ్యయనం చేయాలి. చాలా అంశాలు ముందు ఇవ్వనివి కూడా ఇక్కడ ఇచ్చారు.

◆ ఏఐపీఎంటీ, నీట్ 2008-17 వరకు జరిగిన పరీక్షల ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. దీని వల్ల ఏ స్థాయిలో ప్రశ్నలు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా పర్యావరణశాస్త్రం యూనిట్‌కు సంబంధించి కొంత పరిమితి దాటి వచ్చిన ప్రశ్నలు ఏయే అంశాలపై దృష్టిపెట్టాలనే విషయంపై అవగాహన కలిగిస్తాయి.

◆ ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకం ప్రతి అధ్యాయం చివర ప్రశ్నలుంటాయి. అలాంటివాటికి సమాధానాలను సిద్ధం చేసుకోవాలి.

◆ 11, 12 తరగతుల పుస్తకాల స్థాయికి మించిన ప్రశ్నలకు సిద్ధం కావాలంటే ముందుగా అందులోని అంశాలను క్షుణ్ణంగా చదవాలి. ఆ తర్వాత మాత్రమే అదనపువాటిని ప్రయత్నించాలి. పుస్తకంలోని అంశాల ఆధారంగా దానికి అనుసంధాన అంశాలను చూసుకోవాలి.

◆ ఎన్‌సీఈఆర్‌టీ వారి ఎక్సెంప్లర్ బయాలజీ అనే ప్రశ్నల పుస్తకం ఉంది. ఆ ప్రశ్నలూ వాటికి సమాధానాలూ చూసుకోవడం అవసరం. అక్కడక్కడ తప్పులు ఉంటే సరిచేసుకుని చదువుకోవాలి.

◆ పాత పుస్తకాల్లోని అంశాలకు 2015 తరువాత అంటే 2016/2017 ముద్రణలో వచ్చిన పుస్తకాలను చూసుకోవాలి. అందులో చిన్నచిన్న మార్పులున్నాయి. వాటికి అనుగుణంగా చదువుకోవాలి.

◆ జంతుశాస్త్రంలోని కీళ్లు (జాయింట్స్)కు సంబంధించి అలాగే వృక్షశాస్త్రానికి సంబంధించి ప్రయోగాలు కొన్ని ప్రాక్టికల్ మాన్యువల్‌లో ఉన్నాయి. వాటిని కూడా తెలుసుకుంటే మంచి స్కోరును ఆశించవచ్చు.

◆ ప్లాంట్ కింగ్‌డమ్, ఆనిమల్ కింగ్‌డమ్‌లకు సంబంధించి, పుస్తకంలో ఇచ్చిన వాటితోపాటు కొన్ని ముఖ్యమైన అదనపు ఉదాహరణలను కూడా చూసుకోవడం మంచిది.

◆ ప్రతి అంశాన్నీ చదివాక దానికి సంబంధించిన ప్రశ్నలను చేయాలి. దానివల్ల చదివిన అంశానికి భిన్నంగా కూడా ఆలోచించడం అలవాటు అవుతుంది. నమూనా పరీక్షలు రాయడం వల్ల సమయపాలనను పాటించవచ్చు.

తేలికేనని చిన్న తప్పులు

బయాలజీ అంటే తేలిక అని కొంతమంది అశ్రద్ధ వహిస్తారు. దీంతో చిన్న చిన్న తప్పులు చేస్తారు. 2015, 2016, 2017 ప్రశ్నపత్రాలను గమనిస్తే ఎక్కువ శాతం ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల అంశాల ఆధారంగానే ఉన్నాయి. అయితే 2017 ప్రశ్నపత్రం కొంతవరకు విశ్లేషణాత్మకంగా ఉందని విద్యార్థులు భావించారు. తెలిసినట్టే ఉండి, తొందరలో తప్పులు చేయించేవిగా కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. 90 ప్రశ్నల్లో కనీసం 84-85 ప్రశ్నలవరకు కష్టపడి జాగ్రత్తగా చదువుతూ వెళితే చేయవచ్చు. కొద్దిగా అదనంగా అవగాహన, అధ్యయనం చేస్తే మిగిలిన ప్రశ్నలు చేయవచ్చు. అంటే.. కనీసం 330-340 వరకు మార్కులు సాధించడం అంత కష్టం కాదు.

గత పరీక్షల్లో 5-7 ప్రశ్నలు కొంత పరిధి దాటి ఉంటున్నాయి. 2017 ప్రశ్నపత్రంలోనూ కొద్దిగా ఆలోచింపజేసేవిగా లేదా రెండు సమాధానాల మధ్య తేల్చుకోలేనివిగా కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. అయితే రెండు సంవత్సరాల సిలబస్‌లో.. 11వ తరగతి నుంచి 44 , 12వ తరగతి నుంచి 46 ప్రశ్నలు వచ్చాయి. ప్రశ్నల్లో క్లిష్టతనుబట్టి చూస్తే... సాధారణ ప్రశ్నలు- 60, మధ్యరకం- 16, విశ్లేషణాత్మక మైనవి- 14 ఉన్నాయి.

కొన్ని అంశాల్లో ఎక్కువ ప్రశ్నలు ఇస్తున్నారు. జంతుశాస్త్రంలో మానవ శరీరధర్మ శాస్త్రం, వృక్షశాస్త్రంలో వైవిధ్యం (ప్లాంట్ డైవర్సిటీ)లో ఎక్కువ ప్రశ్నలు వచ్చాయి. అలాగే పర్యావరణ శాస్త్రం (ఎకాలజీ), జన్యుశాస్త్రం (జెనెటిక్స్ అండ్ మాలిక్యులార్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటెన్స్) వంటి పాఠ్యాంశాల్లో ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి.

కోరుకున్న కొలువు కాస్తలో చేజారిందా?

ఒక్క మార్కు కూడా రానప్పుడు ఎక్కువ బాధపడం కానీ, పాస్ అవ్వడానికి ఒక్క మార్కు తగ్గితే బాధపడతాం! ఒక్క పరుగు కూడా చేయనప్పుడు బాధపడం కానీ... సెంచరీకి ఒక్క పరుగు తగ్గితే బాధనిపిస్తుంది! అలాగే... అసలు ఉద్యోగం తెచ్చుకునే నైపుణ్యాలు మన దగ్గర లేకపోతే బాధపడం కానీ... ఆ స్కిల్స్ ఉండీ కొంచెంలో కొలువు చేజారిపోతే ఎంతో బాధపడతాం...! అలా జరగకూడదంటే ఏయే విషయాల్లో ఏం గ్రహించాలి? ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

ఒక మ్యాచ్‌లో 99 పరుగులు సాధించి అవుటై, తరువాత మ్యాచ్‌లో ఒక పరుగు సాధిస్తే సెంచరీ అవ్వదు! మళ్లీ మొదటి పరుగు నుంచీ ప్రారంభించాల్సిందే కదా! ఉద్యోగ సాధన కూడా క్రికెట్ మ్యాచ్ లాంటిదే. సెలక్ట్ అయ్యేవారికీ అవ్వనివారికీ మధ్య తేడా చాలాసార్లు, 99కీ, 100కీ ఉన్నంతే ఉంటుంది. చూడటానికి ఒక్క పరుగే అనిపిస్తుంది. కానీ ఆ ఒక్క పరుగే భవిష్యత్తుని నిర్ణయిస్తుంది. 100కి ఉన్న విలువ 99కి ఉండదు. 100లో సంతృప్తి ఉంటుంది. 99లో సానుభూతి ఉంటుంది. 100లో సాధించాం అన్న ఆనందం ఉంటుంది. 99లో దగ్గరికి వచ్చి ఓడిపోయామన్న బాధ ఉంటుంది. ఉద్యోగాన్ని సంపాదించడంలోనూ దగ్గరగా వచ్చి కూడా ఎందుకు ఓటమిపాలయ్యామన్నది ఒకసారి ప్రశ్నించుకోవాలి.

ఉద్యోగం విషయంలో ఎంతోమంది ఎన్నో సలహాలు ఇస్తూ ఉంటారు. ఇంటర్వ్యూకి ఇలా వెళ్లాలి, ఈ విధంగా మాట్లాడాలి, రాత పరీక్షకు ఈ రకంగా సన్నద్ధమవ్వాలి, గ్రూప్ డిస్కషన్స్‌లో ఇలా ప్రవర్తించాలి, టెక్నికల్ ప్రశ్నలకు ఈ తీరులో సమాధానమివ్వాలి.. అంటూ ఎన్నో విలువైన సూచనలు ఇస్తూ ఉంటారు. ఆ సలహాలన్నీ పెద్దపెద్ద తప్పులు చేయకుండా ఉండేందుకు ఉపయోగపడతాయి. కానీ, తెలియకుండానే చిన్నచిన్నవీ, తెలిసీతెలియనివీ తప్పులెన్నో చేస్తూ ఉంటాం.

ఎంత బాగా రాసినా, ఇంటర్వ్యూలో ఎంత బాగా మాట్లాడినా ఉద్యోగం ఎందుకు రావటంలేదో ఒక్కోసారి అర్థం కాదు. కొన్నిసార్లు మనకంటే తక్కువ చదివేవాళ్లు, మనకంటే తక్కువ నైపుణ్యాలు ఉన్నవాళ్లు కూడా ఎంపికైపోతుంటారు. అసలు ఎక్కడ పొరపాటు జరుగుతోందో ఎంత ప్రయత్నించినా తెలుసుకోలేకపోతుంటాం. అలా మనం తెలుసుకోలేని చిన్నచిన్న తప్పులే 'అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్' (అనవసరపు తప్పిదాలు). ఈ పొరపాట్లు రాత పరీక్షలో, గ్రూప్ డిస్కషన్స్‌లో, జస్ట్ ఎ మినిట్ (జామ్) రౌండ్‌లో, ఇంటర్వ్యూలో.. ఎక్కడైనా జరగొచ్చు. కాబట్టి మనమెంతో జాగ్రత్తగా ఉండాలి.

ఆ పొరపాట్లు ఏమిటో... అవి ఎక్కడెక్కడ జరిగే అవకాశం ఉందో తెలుసుకుందాం.

1 జామ్ (జస్ట్ ఏ మినిట్)

ఇందులో ఒక టాపిక్‌ను ఇచ్చి నిమిషంపాటు దాని గురించి మాట్లాడమంటారు. 'రవి' అనే విద్యార్థిని జామ్‌లో తన రోల్ మోడల్ గురించి మాట్లాడమని అడిగారు. అతను 'రవీంద్రనాథ్ ఠాగూర్' గురించి అనర్గళంగా, ఆత్మవిశ్వాసంతో మాట్లాడాడు. తర్వాత ప్రకటించిన ఫలితాల్లో తన పేరు లేకపోవడం అతణ్ణి షాక్‌కి గురిచేసింది. ఎంత ఆలోచించినా తను ఎందుకు సెలెక్ట్ కాలేదో అర్థం కాలేదతడికి.

హెచ్‌ఆర్ అధికారిని కలిసి కారణం అడిగాడు. 'నువ్వు ఠాగూర్ గొప్పతనం గురించి బాగా మాట్లాడావ్. కానీ, ఆయన నీకెందుకు రోల్ మోడల్ అయ్యారో.. నువ్వేం స్ఫూర్తి పొందావో ఒక్క మాట కూడా చెప్పలేదు. అందుకే నిన్ను సెలెక్ట్ చేయలేదు' అని ఆయన వివరించాక రవికి అర్థమైంది. రోల్ మోడల్ ఘనత గురించి మాత్రమే కాదు, ఆ వ్యక్తి తనకెంత ప్రేరణ కలిగించారో కూడా మాట్లాడాల్సివుంటుందని బోధపడింది. తర్వాత రెండు నెలలకు వాళ్ల కాలేజీకి ఇంకో కంపెనీ వచ్చింది. అప్పుడు మళ్లీ రోల్ మోడల్ గురించే మాట్లాడమన్నారు. రవి ఈసారి 'యువరాజ్ సింగ్' కాన్సర్‌తో ధైర్యంగా పోరాడిన విషయాన్ని ప్రస్తావిస్తూ అది తనలో స్ఫూర్తిని నింపిందనీ, మనిషి తలచుకుంటే ఏదైనా సాధించగలడనే నమ్మకం యువరాజ్ వల్లే తనకు వచ్చిందనీ చెప్పాడు. ఈసారి తర్వాతి రౌండుకు సెలక్ట్ అయ్యాడు. ధైర్యం చేసి హెచ్‌ఆర్ అధికారిని అడగడం వల్ల తప్పెక్కడ జరిగిందో అర్థమైంది. దాన్ని సరిదిద్దుకోగలిగాడు.

2 చర్చల్లో దూకుడొద్దు

చాలామంది జామ్‌లో చేసే తప్పులనే గ్రూప్ డిస్కషన్స్‌లోనూ పునరావృతం చేస్తుంటారు. టాపిక్ ఒకటైతే ఇంకేదో చెప్పడమో, హెచ్‌ఆర్‌ను మెప్పించడానికి ఎక్కువగా మాట్లాడటమో చేస్తుంటారు. ఒక్కోసారి మిగతావాళ్ల గురించి ఆలోచించకుండా మాట్లాడుతూనే ఉంటారు. ఇవన్నీ చాలా పెద్ద తప్పులు. ఎందుకంటే గ్రూప్ డిస్కషన్స్ ముఖ్యమైన ఉద్దేశమే మనం బృందంతో ఎలా ఉంటాం, టీంని లీడ్ చేసే సామర్థ్యం మనలో ఉందా లేదా అనేది తెలుసుకోవడం. కాబట్టి అందరికీ మాట్లాడే అవకాశం ఇవ్వాలి. అందరి మాటలూ వినాలి. ఎవరినీ కించపరుస్తూ మాట్లాడకూడదు. ఇవన్నీ పట్టించుకోకుండా ఎంత బాగా మాట్లాడినా సెలక్ట్ అయ్యే అవకాశాలు చాలా తక్కువ. అందుకే గ్రూప్ డిస్కషన్స్‌లో హుందాగా ప్రవర్తించాలి. నిరాడంబరంగా ఉండాలి. దూకుడు చూపిస్తే మార్కులను కోల్పోవాల్సి వస్తుంది.

3 రాతపరీక్ష (ఆప్టిట్యూడ్ టెస్ట్)

అన్ని రౌండ్ల కంటే ఎక్కువ తప్పులు.. చిన్నచిన్నవన్నీ ఇక్కడే చేస్తాం. ఎంతో పరిజ్ఞానం ఉన్నవాళ్లు కూడా ఇక్కడే విఫలమవుతుంటారు. అసలెక్కడ తప్పు జరుగుతోందో కూడా తెలుసుకోకుండా మళ్లీమళ్లీ చేసిన పొరపాట్లే చేస్తూ ఉంటారు. పోటీపరీక్షలకీ, కళాశాల పరీక్షలకూ చాలా తేడా ఉంటుంది. కాలేజీలో అకడమిక్ పరీక్ష పేపర్ ఈజీగా వస్తే 80-90% మార్కులు వస్తాయి. అందరూ మెచ్చుకుంటే సంతోషపడతాం. అదే పేపర్ కష్టంగా వస్తే 55-60% మార్కులు వస్తాయి. అందరూ తిడితే బాధపడతాం. అందుకే పేపర్ సులభంగా రావాలని కోరుకుంటాం. కానీ పోటీపరీక్షలు వేరు (క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో సహా). 'పేపర్ ఈజీగా ఉంది' అంటే ఆ పేపర్ మీకు మాత్రమే ఈజీ కాదు... మీతోపాటు పరీక్ష రాసే వాళ్లందరికీ ఈజీనే! మీకు 90% వస్తే మీతోపాటు అదే పరీక్ష రాసిన వాళ్లందరికీ 91%, 92%, 93% వచ్చే ఛాన్స్ ఉంది. అందుకే పేపర్ ఎంత ఈజీగా వచ్చినా... మీరెంత బాగా రాసినా.. మీతోపాటు రాసేవాళ్ల కంటే మీరు ముందున్నారా లేదా అనేదే ముఖ్యం. ఈ పోటీ ప్రపంచంలో పరుగు ఆపితే వెనుకబడిపోతాం, ఓడిపోతాం. అందుకే పరుగెడుతూనే ఉండాలి. అందరికంటే ముందుండాలి!

పి. వంశీకృష్ణా రెడ్డి
ఎండీ, CREATE U

ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో అలా ఉండాలంటే 'డెసిషన్ మేకింగ్' చాలా ముఖ్యం. సాధారణంగా ఏ కంపెనీ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో అయినా 50 ప్రశ్నలుంటాయి. 30-40 నిమిషాల సమయాన్ని ఇస్తారు. ఆ 50 ప్రశ్నల్లో సుమారు 20 సులువు, 20 మధ్యస్థం, 10 కష్టంగా ఉంటాయి. పేపర్ మొత్తాన్ని సాధించడానికి కనీసం 75-80 నిమిషాలు పడుతుంది. కానీ ఇక్కడ ఇచ్చేది 30 నిమిషాలే. కాబట్టి, ముందుగా వేటిని చేయాలో నిర్ణయించుకోవాలి. ముందుగా తేలికైన వాటిని ఎంచుకుని సాధించాలి. ఆ తరువాత మధ్యస్థ ప్రశ్నలు చేయాలి. కష్టమైనవాటిని చేస్తే ఎక్కువ మార్కులేమీ ఇవ్వరు. బాగా కష్టమనిపించిన వాటిని వదిలేయవచ్చు. అవి తెలియక కాదు.. చేయడం ఇష్టం లేక వదిలేయాలి.

టెస్ట్ క్రికెట్‌లో రాహుల్ ద్రవిడ్ చాలా బంతులను వదిలేసేవాడు. ఎందుకు? క్రికెట్ రాక కాదు. ఆ బంతులు ఆడటం ఇష్టం లేక. అలా వదిలేస్తూ ఉంటే బౌలర్ విసిగిపోయి ఈజీ బాల్స్ వేస్తాడు. అప్పుడు సులువుగా స్కోర్ చేసుకోవచ్చు అన్న ఉద్దేశం ద్రవిడ్‌ది. సరిగా ఇదే కాన్సెప్టును ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో వాడాలి. కష్టమైన ప్రాబ్లమ్స్‌ను అన్నింటినీ వదిలేస్తే కచ్చితంగా సులువైనవి మిగులుతాయి. వాటిని తక్కువ సమయంలో సాధించవచ్చు. ఎక్కువ స్కోర్ చేయొచ్చు. ఇలా వేటిని సాధించాలి, వేటిని వదిలేయాలనే వాటి విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటే సులువుగా ఆప్టిట్యూడ్ రౌండ్‌ను పూర్తిచేయవచ్చు.

4 హాబీల గురించి...

ఒక అభ్యర్థి ఇంటర్వ్యూ వరకూ వచ్చాడంటే దాదాపుగా ఎంపికయిపోయినట్టే! ఇంటర్వ్యూకి హాజరయ్యేటప్పుడు ఫార్మల్ డ్రెస్సింగ్ ఉండాలి. అబ్బాయిలు గడ్డాన్ని నీట్‌గా ట్రిమ్ చేసుకోవడం, అమ్మాయిలు అతిగా మేకప్ వేసుకోకుండా ఉండటం లాంటివి అందరికీ తెలిసే ఉంటాయి. కానీ కొన్ని విషయాల్లో తెలియకుండానే తప్పులు చేస్తుంటాం. అవకాశాన్ని చివరి క్షణాల్లో పోగొట్టుకుంటుంటాం. అలాంటి వాటిలో..

అభిరుచులు: రెజ్యూమేలో హాబీల గురించి రాసేప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. దానిలో రాసినవాటిపై ప్రశ్నలను కచ్చితంగా అడుగుతారు. హాబీ అంటే మనకు అది చాలా ఇష్టమైంది అని. ఆ పని చేయడంలో మనకెంతో ఆనందం ఉంటుంది అని. అందుకే హాబీ గురించి ఇంటర్వ్యూయర్ అడిగినపుడు చిరునవ్వుతో బదులివ్వాలి. దాని గురించి సంతోషంగా మాట్లాడాలి.

ఉదాహరణకు హాబీ 'క్రికెట్' అని రాశారనుకోండి. అప్పుడు క్రికెట్ గురించి ఏం అడిగినా చెప్పగలగాలి. బ్యాట్ సైజు, మొదటి ఇంటర్నేషనల్ మ్యాచ్ ఎక్కడ జరిగింది? ప్రపంచంలో పెద్ద స్టేడియం ఎక్కడుంది?... లాంటి ఏ ప్రశ్నకైనా సమాధానం రెడీగా ఉండాలి. అంతేకానీ... నాకు 'క్రికెట్‌లో బేసిక్స్ మాత్రమే తెలుసు' లాంటి సమాధానాల వల్ల రిజెక్ట్ అయ్యే అవకాశాలెక్కువ. సింగింగ్‌ను హాబీగా రాసినవాళ్లని గాయకుల పేర్లు, పాడమని అడగటం లాంటివి చేయవచ్చు. అలాగే కుకింగ్ అని చెబితే తయారీ విధానాన్ని అడగవచ్చు. అప్పుడు విసుక్కోకుండా నవ్వుతూ సమాధానాలు ఇవ్వడం ఎంతో ముఖ్యం!

సమయస్ఫూర్తి: చాలాసార్లు ఇంటర్వ్యూల్లో అభ్యర్థి సమయస్ఫూర్తి (స్పాంటేనిటీ)ని పరీక్షిస్తుంటారు. అందుకు అనవసరమైన ప్రశ్నలు వేస్తుంటారు. అప్పుడు 'గుర్తు రావట్లేదు, ఆలోచిస్తున్నా' అని చెబితే తక్కువ అభిప్రాయం ఏర్పడుతుంది.

ఉదాహరణకు 'పొద్దున బ్రేక్ ఫాస్ట్‌లో ఏం తిన్నావ్?' అని అడిగితే వెంటనే 'ఇడ్లీ' అని చెప్పెయ్యాలి. ఆలోచించకూడదు. ఎందుకంటే నువ్వు ఏం తిన్నావో ఇంటర్వ్యూయర్ వచ్చి చెక్ చేయరు కాబట్టి. 'నీకు ఇడ్లీ వడ్డించేటప్పుడు మీ అమ్మ ఏ రంగు గాజులు వేసుకుంది' అనడిగితే ఎక్కువ ఆలోచించకుండా 'గ్రీన్' అనో 'రెడ్' అనో చెప్పాలి.. వచ్చి చూడలేరు కాబట్టి. ఏ నంబర్ బస్సు ఎక్కి వచ్చావ్ అంటే ఏదో నోటికొచ్చిన నంబర్ చెప్పవచ్చు. ఇలాంటి ప్రశ్నలు ఊరికే మన ఐక్యూను పరీక్షించడానికి అడుగుతుంటారు. ఇక్కడ కొంచెం అయోమయానికి గురైనా రిజెక్ట్ అయ్యే అవకాశాలే ఎక్కువ. ఇలా తీసుకునే కొన్ని జాగ్రత్తలు సులువుగా ఉద్యోగాన్ని తెచ్చుకోవడంలో సాయపడతాయి.

ఆశించిన కొలువును చేజార్చుకోకూడదంటే చిన్న విషయాల్లో కూడా జాగ్రత్తగా ఉండాలి. ఒక గొప్ప వ్యక్తి అన్నట్లు.. "Big mistakes will affect you sometime but small mistake will affect you lifetime".

లైబ్రరీ

కాంపిటీటివ్ ఎగ్జామ్స్, అకడమిక్, ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఇటీవల విడుదలైన పుస్తకాల వివరాలు.

తెలంగాణ టీఆర్‌టీ

1) స్కూల్ అసిస్టెంట్స్ సోషల్ స్టడీస్ కంటెంట్
పేజీలు: 960, ధర: రూ. 599

2) ఎస్‌ఏ- ఫిజికల్ సైన్స్ కంటెంట్
పేజీలు: 848, ధర: రూ. 599

3) ఎస్జీటీ టాప్ 20 మోడల్ పేపర్స్
పేజీలు: 288, ధర: రూ. 169

ప్రచురణ: విజేత కాంపిటీషన్స్

ఇంటర్ రెండు మార్కుల ప్రశ్నలు



1) జూనియర్ ఇంటర్ గణితం 1ఎ, పేజీలు: 135
2) గణితం 1బి, పేజీలు: 128
3) ఫిజిక్స్, పేజీలు: 144
4) కెమిస్ట్రీ, పేజీలు: 160
5) సీనియర్ ఇంటర్ గణితం 2ఎ, పేజీలు: 144
6) గణితం 2బి, పేజీలు: 160
7) ఫిజిక్స్, పేజీలు: 128
8) కెమిస్ట్రీ, పేజీలు: 200
ప్రతి పుస్తకం: రూ. 100
ప్రచురణ: శ్రీసిరి పబ్లిషర్స్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు

పోస్టులు: 9,232 (పీజీటీ, టీజీటీ తదితరాలు)
అర్హత: డిగ్రీ, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్)/ డిప్లొమా, పీజీ డిగ్రీ.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్.
దరఖాస్తు ప్రారంభం: 05.01.2018. **చివరితేది:** 31.01.2018.
వెబ్‌సైట్: www.dsssb.delhigovt.nic.in

దిల్లీ యూనివర్సిటీ

ఖాళీల సంఖ్య: 30 **పోస్టులు:** బయోడైవర్సిటీ ఎక్స్‌పర్ట్/ ఎకాలజిస్ట్/ ఫీల్డ్ బయాలజిస్ట్/ టెక్నికల్ అసిస్టెంట్/ నేచర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్/ సూపర్‌వైజర్/ ఫీల్డ్ సూపర్‌వైజర్/ సీనియర్ ఫీల్డ్ వర్కర్/ డ్రైవర్. **అర్హత:** పీహెచ్‌డీ, ఎంఎస్సీ, డిగ్రీ, పదో తరగతి.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా. **చివరితేది:** 14.01.2018. **వెబ్‌సైట్:** http://www.du.ac.in

ఎస్వీయూలో అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు

అసోసియేట్ ప్రొఫెసర్: 06
అర్హత: పీహెచ్‌డీ డిగ్రీ.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా.
చివరితేది: 22.01.2018.
ఆప్లికేషన్: https://www.svuniversity.edu.in/

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

పోస్టులు: 09
అసిస్టెంట్ లీగల్ అడ్వయిజర్–04, అసిస్టెంట్ డైరెక్టర్–03, డిప్యూటీ డైరెక్టర్–01, అసోసియేట్ ప్రొఫెసర్–01. **అర్హత:** డిగ్రీ, పీజీ. **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. **చివరితేది:** 11.01.2018. **వెబ్‌సైట్:** http://www.upsconline.nic.in

ప్రవేశాలు

నేషనల్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్ - 2018

కోర్సు: అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ
విభాగాలు: బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్.
అర్హత: ఇంటర్. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
చివరితేది: 05.03.2018. **పరీక్షతేదీ:** 02.06.2018.
వెబ్‌సైట్: https://nestexam.in

వాక్‌ఇన్

తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ

అంప్రెంటిస్‌షిప్, అర్హత: ఇంజినీరింగ్ డిగ్రీ, డిప్లొమా.
వాక్‌ఇన్ తేది: 28, 29.12.2017 **వెబ్‌సైట్:** http://mhrdnats.gov.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.